సాక్షి
కుమురం భీం

ఆదివారం । 15 । సెప్టెంబర్ । 2024



అట్టహాసంగా బేస్‌బాల్ పోటీలు

నిర్మల్ జిల్లా కేంద్రంలో రాష్ట్రస్థాయి అండర్ -21 జూనియర్స్ బాలబాలికల బేస్‌బాల్ పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి.

8లో▸



అప్రమత్తతే రక్ష..!

జిల్లాలో వినాయకుల ఊరేగింపు. నిమజ్జన సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

9లో▸

గరిష్టం/కనిష్టం
32.2 /24.2

వాతావరణం

ఆకాశం కొంతమేర మేఘావృతమై ఉంటుంది. ఉక్కపోతగా ఉంటుంది. అక్కడక్కడ జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

డీఎస్పీగా రామానుజం బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న డీఎస్పీ

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ డీఎస్పీగా రామానుజం శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ డీఎస్పీగా పనిచేసిన కరుణాకర్ ఆసిఫాబాద్‌కు బదిలీ కాగా ఆయన స్థానంలో హైదరాబాద్‌లో విధులు నిర్వహిస్తున్న రామానుజం బదిలీపై కాగజ్‌నగర్ వచ్చారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా పట్టణ సీఐ శంకరయ్య పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

టీపీసీసీ అధ్యక్షుడిని కలిసిన జిల్లా నేతలు



మహేశ్‌కుమార్‌గౌడ్‌తో విశ్వప్రసాదరావు

ఆసిఫాబాద్: తెలంగాణ పీసీసీ అధ్యక్షుడిగా నియమితులైన మహేశ్ కుమార్‌గౌడ్‌ను శనివారం డీసీసీ అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాదరావుతో పాటు జిల్లా కాంగ్రెస్ నేతలు కలిశారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలుసుకుని శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కలిసిన వారిలో జిల్లా కాంగ్రెస్ నాయకులు అనిల్ గౌడ్, తదితరులు ఉన్నారు.

మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల బదిలీ

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు బదిలీ అయ్యారు. ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ సహా ఉపాధ్యాయులు రాకేష్, శంకర్, ప్రవీణ్, భాగ్యశ్రీ మంచిర్యాల జిల్లా కాసిపేటకు, సంపత్, వరలక్ష్మి, స్వరూప మందమర్రికి, మహేష్ కోటపల్లికి, రమేశ్ దండేపల్లికి, రేష్మా పర్వీన్, శోభ మంచిర్యాలకు బదిలీ అయ్యారు. దండేపల్లికి చెందిన పీటీజీ మహేశ్వర్, ధర్మారంకు చెందిన టీజీటీ ఫర్హీన్ ఆసిఫాబాద్ పాఠశాలకు బదిలీపై వచ్చారు.

'పరామర్శకు వెళ్తే అడ్డుకోవడం సరికాదు'



బీజేపీ నాయకులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

ఆసిఫాబాద్‌అర్బన్: ఇటీవల జిల్లాలోని జైనూర్‌లో జరిగిన దాడికి గురైన వారిని పరామర్శించేందుకు వెళ్లే వారిని పోలీసులు ముందస్తుగా అడ్డుకోవడం సరికాదని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఖాండ్రె విశాల్, ఎస్సీ మోర్చా జిల్లా నాయకుడు జయరాజ్ అన్నారు. బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కళ్యాణ్‌నాయక్ తలపెట్టిన చలో జైనూర్ కార్యక్రమం సందర్భంగా ఎలాంటి అనుమతులు లేకుండా అర్ధరాత్రి అక్రమంగా అరెస్టు చేయడం ప్రజాస్వామ్యానికి భంగం కలిగించడమే అవుతుందన్నారు. కాంగ్రెస్ పాలనలో పోలీసుల రాజ్యం నడుస్తోందని, పోలీసు యంత్రాంగాన్ని అడ్డుపెట్టుకొని ప్రభుత్వాన్ని నడుపుతున్న కాంగ్రెస్ సర్కార్‌కు ప్రజలు బుద్ధి చెబుతారన్నారు. రాబోయే రోజుల్లో బీజేపీ ప్రభుత్వం ఏర్పడుతుందన్నారు.

ఏజెన్సీ ప్రశాంతం..



డీవీ శ్రీనివాసరావు, ఎస్పీ

- ఘర్షణలు పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు
- ఆరోజు ఆస్తినష్టం మినహా ఇతర దుర్ఘటనలేవీ జరగలేదు
- విధ్వంసకారులను గుర్తిస్తున్నాం.. అరెస్టులు కొనసాగుతాయి
- పొరుగు రాష్ట్రాల నుంచి ఇక్కడికి వస్తున్న వారిపై నిఘా ఉంటుంది
- 'సాక్షి' ఇంటర్వ్యూలో ఎస్పీ డీవీ శ్రీనివాసరావు

సాక్షి, ఆసిఫాబాద్: 'ఆసిఫాబాద్ జిల్లాలోని జైనూరులో ఇరువర్గాల ఘర్షణల నేపథ్యంలో అట్టుడికిపోయిన ఏజెన్సీ ప్రాంతంలో ప్రశాంత వాతావరణం నెలకొంది. శాంతియుత చర్చల ద్వారా ఇరువర్గాల మధ్య నెలకొన్న వైషమ్యాలను రూపుమాపేందుకు కృషి చేస్తున్నాం. ఉదయం, సాయంత్రం మూడేసి గంటలపాటు ప్రజలు నిత్యావసరాలు ఇతరత్రా పనులు చేసుకోవడానికి వెసులుబాటు కల్పించాం. అక్కడ 144 సెక్షన్ కొనసాగుతోంది. ఇంటర్నెట్ సేవలపై ఆంక్షలు పెట్టాం. ఆస్తినష్టానికి పాల్పడ్డ విధ్వంసకారులను గుర్తిస్తున్నాం. ఇప్పటికే 30 మందిని అరెస్టు చేశాం. మరికొందరిని గుర్తించే పనిలో సిబ్బంది నిమగ్నమయ్యారు. అరెస్టులు కొనసాగుతాయి. జైనూరు ఘటనను మరింత జటిలం చేసేందుకు ప్రయత్నిస్తున్న వారిపై కఠినంగా వ్యవహరిస్తాం. పొరుగు రాష్ట్రాల నుంచి ఇక్కడికి వస్తున్న వారి కదలికలపై నిఘా ఉంచాం. ఆదివాసీ మహిళపై దుశ్చర్యలకు పాల్పడ్డ నిందితుడిని కఠినంగా శిక్షించేలా చర్యలు చేపట్టాం. అందుకోసం సమర్థుడైన అధికారికి ఇన్వెస్టిగేషన్ బాధ్యతలు అప్పగించాం. నేరచరిత్ర కలిగివున్న నిందితుడు షేక్ మగ్దూంపై పీడీ చట్టాన్ని అమలు చేయబోనున్నాం.' అని జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు పేర్కొన్నారు. జైనూరులో ప్రశాంత వాతావరణం నెలకొల్పేందుకు పోలీసుశాఖ చేపడుతున్న చర్యలు గురించి శనివారం 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు వివరాలు వెల్లడించారు.

జైనూరులో శాంతిభద్రతలు అదుపులోకి వచ్చాయా? పరిస్థితులు ఎలా ఉన్నాయి?

ఎస్పీ: ఆదివాసీ మహిళపై ఆటోడ్రైవర్ అత్యాచారయత్నం, హత్యాయత్నం చేయడంతో ప్రతీకార చర్యలకు పాల్పడ్డ ఇరువర్గాలతో శాంతి చర్చలు జరపడం ద్వారా అక్కడ శాంతిభద్రతలు అదుపులోకి తెచ్చాం. ఇరువర్గాలు సంయమనం పాటించాలని కోరాం. ప్రస్తుతం ఏజెన్సీలో ప్రశాంత వాతావరణం నెలకొంది. 144 సెక్షన్ కొనసాగిస్తున్నాం.

144 సెక్షన్ కొనసాగిస్తుండంతో ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు? ఇంటర్నెట్ సేవలు ఎప్పుడు పునరుద్ధరిస్తారు?

ఎస్పీ: ఇప్పుడిప్పుడే ఏజెన్సీ ప్రాంతంలో ప్రశాంత వాతావరణం నెలకొంటోంది. 144 సెక్షన్ అమలులో ఉన్నప్పటికీ ఉదయం, సాయంత్రం మూడేసి గంటల చొప్పున ప్రజలకు వెసులుబాటు కల్పించాం. త్వరలో ఐజీకి పరిస్థితులు వివరించి వారి ఆదేశాల మేరకు 144 సెక్షన్ ఎత్తివేస్తాం. ఇంటర్నెట్ సేవలూ పునరుద్ధరిస్తాం.

నిందితుడికి కఠిన శిక్ష పడేలా ఏమైనా చర్యలు తీసుకున్నారా?

ఎస్పీ: ఆదివాసీ మహిళపై భౌతికదాడికి దిగిన నిందితుడు షేక్ మగ్దూంకు కఠినమైన శిక్ష పడేలా చర్యలు తీసుకున్నాం. ఆ మేరకు సమర్థుడైన అధికారిని విచారణ అధికారిగా నియమించాం. సమగ్ర నివేదిక అందాక.. పకడ్బందీగా చార్జిషీటు దాఖలు చేసి.. త్వరిగతిన శిక్ష పడేలా చర్యలు తీసుకుంటాం. ఇదివరకే నేరచరిత్ర కలిగిన నిందితుడిపై పీడీ చట్టాన్ని అమలు చేస్తాం.

ఇప్పటి వరకు ఎంతమంది నిందితులను అరెస్టు చేశారు? ఇంకా ఎంతమందిని మందిని అరెస్టు చేసే అవకాశం ఉంది?

ఎస్పీ: జైనూరులో ప్రతీకార చర్యలకు పాల్పడ్డ వారిని గుర్తించాం. ఘటన జరిగాక విధ్వంసకారులందరూ ఇతర ప్రాంతాలకు వెళ్లి తలదాచుకుంటున్నారు. నిఘా వ్యవస్థ ద్వారా వారు ఎక్కడ ఉన్నది కనిపెట్టి అరెస్టు చేస్తున్నాం. ఇప్పటి వరకు ఇరువర్గాలను కలిపి 30 మంది వరకు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించాం. బయట ప్రాంతాల్లో తలదాచుకున్న వారిని గుర్తించే పని కొనసాగుతోంది. అరెస్టులూ కొనసాగుతాయి.

ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు మీరు ఎలాంటి చర్యలు తీసుకోబోతున్నారు?

ఎస్పీ: కొంతకాలంగా అక్కడ కొన్ని వర్గాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొన్న విషయంపై దృష్టి సారించాం. గత పార్లమెంటు ఎన్నికల రోజు అక్కడ గొడవలు జరిగాయి. ఆ గొడవల్లో పాల్గొన్న 65 మంది నిందితుల్లో 50 మంది వరకు అరెస్టు చేశాం. మరో 15 మంది పరారీలో ఉన్నారు. వారిని త్వరలోనే అరెస్టు చేస్తాం.

పొరుగు రాష్ట్రాల నుంచి మారణాయుధాలు ఇక్కడికి తరలిస్తున్నారనే అనుమానాలు ఆదివాసీల నుంచి వ్యక్తమవుతున్నాయి? మీ స్పందన ఏమిటి?

ఎస్పీ: పొరుగు రాష్ట్రాల నుంచి ఓ వర్గానికి చెందిన వారు ఇక్కడికి వస్తున్నారని, ఇక్కడ నష్టపోయిన వర్గానికి వాహనాల్లో సరుకులు పంపిణీ చేసే మాటున మారణాయుధాలు తీసుకొస్తున్నారన్న సమాచారాన్ని ఆదివాసీలు నా దృష్టికి తీసుకొచ్చారు. అందులో వాస్తవం ఏమిటన్న దానిపై పరిశీలిస్తున్నాం. నిఘా వర్గాల ద్వారా వారి కదలికలపై ఎప్పటికప్పుడు సమాచారం సేకరించి తగు చర్యలు చేపడుతాం.

అరెస్టులు ఆపండి..



ఎస్పీకి వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు

- ఆదివాసీలకు న్యాయం చేయండి
- ఎస్పీ డీవీ శ్రీనివాసరావుకు వినతి

సాక్షి, ఆసిఫాబాద్: శాంతిభద్రతల కారణం చూపి పోలీసులు ఇప్పటికే 18 మంది ఆదివాసీలను అరెస్టు చేశారని, దయచేసి ఇకపై అరెస్టులు ఆపాలని కోరుతూ శనివారం ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కుతో కలిసి పలువురు ఆదివాసీ సంఘాల నేతలు ఎస్పీ డీవీ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో వారు తమ సమస్యలను ఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే కోవ లక్ష్మి మాట్లాడుతూ ఐదో షెడ్యూల్‌లో ఉన్న భూముల్లో ప్రాంతీయేతరులు పాగా వేసి మాపై ఆచాచకాలు చేస్తున్నారన్నారు. ఏజెన్సీ ప్రాంతానికి వాళ్లు బతకడానికి వచ్చారని, జైనూరు చుట్టుపక్కల ఉన్న 5 మండలాలకు చెందిన ప్రజలు నిత్యం అక్కడికి వచ్చి వెళ్తుంటారన్నారు. మరోవర్గం దుకాణాల్లో వీళ్ల నిత్యావసరాలను కొనుగోలు చేస్తుంటారన్నారు. మా వల్లే లబ్ధి పొందుతూ మావారిపై అరాచకాలు చేస్తున్నారన్నారు. తాజాగా ఆదివాసీ మహిళపై ఆ వర్గానికి చెందిన ఓ వ్యక్తి అత్యాచారయత్నం, హత్యాయత్నం చేసిన ఘటనే అల్లర్లకు కారణమైందన్నారు. ముందు రోజు ఆదివాసీలు చేపట్టిన ధర్నాలో ఆ వర్గం మతపెద్దలు పాల్గొని ఉంటే ఈ సంఘటన జరిగి ఉండేది కాదన్నారు. తప్పు చేసింది వాళ్లయితే శిక్ష మా వాళ్లకు పడుతోందన్నారు. మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు మాట్లాడుతూ 2012 హస్నాపూర్, 2016 ఆసిఫాబాద్ ఘటనలు మా హక్కుల కోసం జరిగాయని, ఇందులో భాగంగానే జైనూరు ఘటన చోటు చేసుకుందన్నారు. ఆదివాసీ సమస్యలను మతాల సమస్యగా చిత్రీకరిస్తున్నారని, దయచేసి దీనిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఆదివాసీ సంఘ నేతలు మాట్లాడుతూ 'ఉద్యోగ, ఉపాధి కల్పనలో మాకు తీవ్ర అన్యాయం జరుగుతోందని, అందువల్లే యువత ఆగ్రహావేశాలతో రగలిపోతున్నారన్నారు. పొట్టచేత పట్టుకుని మా ప్రాంతానికి బతకడానికి వచ్చిన వారు ఇప్పుడు మాపై పెత్తనం చేస్తున్నారన్నారు. అమాయకులైన మా ఆడవాళ్లను మోసం చేసి పెళ్ళిళ్లు చేసుకుని, వారి ద్వారా మా భూముల్ని చెరబట్టారన్నారు. 40 ఏళ్లుగా వస్తురూపేణ, సామాజికంగా, సాంస్కృతికపరంగా మాపై దోపిడీ జరుగుతోందన్నారు. తాజాగా ఆదివాసీలపై వరుసగా నాలుగు ఘటనలు జరిగాయని, వీటికి అడ్డుకట్ట వేయాలన్న ఉద్దేశంతోనే నిరసన తెలుపడానికి జైనూరు బంద్‌కు పిలుపునిచ్చామన్నారు. ఆవేదన, ఆక్రోశంతో ఉన్న ఆదివాసీలు ఆ రోజు విధ్వంసానికి పాల్పడ్డారని, ఆవేశంతో జరిగిన సంఘటన అని, దయచేసి మాపై కేసులు నమోదు చేయవద్దన్నారు. ఆదివాసీ మహిళపై అఘాయిత్యానికి పాల్పడ్డ నిందితుడిపై ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా కఠిన శిక్ష పడేలా చూడాలన్నారు. మా రక్షణ కోసం చట్టాలున్నా అమలుకు నోచుకోవడం లేదన్నారు. మేము గరిబోళ్లమని, మాకు ఎవరి మద్దతు లేదన్నారు. కానీ ఆ వర్గానికి నిత్యం నాలుగైదు లారీల్లో సరుకులు వస్తున్నాయని, వాటి మాటున ఏవైనా మారణాయుధాలు చేరవేస్తున్నారన్న అనుమానాలు ఉన్నాయన్నారు. పోలీసులు ఆ దిశగా దృష్టి సారించాలని కోరారు. శాంతి చర్చలకు మేం సిద్ధమని, మా జాతిని కాపాడాలని ఎస్పీకి విన్నవించారు. ఎస్పీ శ్రీనివాసరావు స్పందిస్తూ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి మీకు న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఎస్పీని కలిసిన వారిలో బీఆర్ఎస్ నాయకురాలు మర్సుకోల సర్వసతి, జిల్లా రాయి సెంటర్ సార్‌మేడి మోతీరాం, తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు బుర్స పోచయ్య, రాజ్‌గోండ్ సేవా సమితి అధ్యక్షుడు మడావి శ్రీనివాస్, కార్యదర్శి మడావి శేషారావు, నాయకులు మడావి గుణవంతరావు, సిడాం శంకర్, సార్‌మేడి ఆనందరావు, తదితరులు ఉన్నారు.

'ఎమ్మెల్సీ' కసరత్తు !

- నూతన ఓటర్ల నమోదు ప్రక్రియ మరూ
- పట్టభద్రుల, టీచర్స్ ఎమ్మెల్సీకి ఎన్నికలు
- పోటీలో నిలిచేందుకు ఆశావహుల సన్నద్ధం

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: పట్టభద్రుల, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం కసరత్తు ప్రారంభించింది. రాష్ట్రంలో ఖాళీ అవుతున్న శాసనమండలిలోని స్థానాలకు తిరిగి ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తోంది. వచ్చే మార్చి 29న ఉమ్మడి మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ పట్టభద్రుల నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి పదవీ కాలం పూర్తి కానుంది. ఇదే జిల్లాల పరిధిలోని టీచర్స్ శాసనమండలి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి పదవీ కాలం కూడా పూర్తికానుంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల సంఘం ఈ స్థానాలకు ఎన్నికల నిర్వహణకు రంగం సిద్ధం చేస్తోంది. ఈ మేరకు నియోజకవర్గ పరిధిలోని పట్టభద్రులతోపాటు అర్హులైన ప్రభుత్వ టీచర్లను కొత్త ఓటర్లుగా నమోదు, ఓటర్ల వివరాల్లో మార్పులు, చేర్పులకు అవకాశం కల్పించింది. అంతా పూర్తి చేసి వచ్చే డిసెంబర్ వరకు తుది జాబితా సిద్ధం చేయనుంది. దీంతో నూతనంగా నమోదైన ఓటర్లతో వచ్చే ఆరునెలల్లోపు ఎమ్మెల్సీ ఎన్నిక నిర్వహణకు ఏర్పాట్లు చేస్తోంది. ఇందుకు కొత్తగా పట్టభద్రులను ఓటరుగా నమోదు చేసుకునేందుకు అవకాశం ఇచ్చింది. వచ్చే నవంబర్ 11 నాటికి ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణత సాధించిన పట్టభద్రులకు ఓటరుగా నమోదుకు అవకాశం కల్పించింది. ఇందుకోసం ఎన్నికల సంఘం ఆయా జిల్లాల ఎన్నికల అధికారులతో అన్ని ఏర్పాట్లు చేస్తోంది.

ఆశావహులు రెడీ

ఎమ్మెల్సీ ఎన్నికల్లో సత్తా చాటేందుకు ఆశావహులు ఇప్పటి నుంచే ప్రణాళికలు వేస్తున్నారు. ఆ మేరకు ఆయా జిల్లాల పరిధిలో బరిలోకి దిగేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. ఎమ్మెల్సీ నియోజకవర్గ పరిధిలో పోటీలో ఉండే ఆశావహులు పలు కార్యక్రమాలు చేపడుతున్నారు. విద్యావంతులు, ఉపాధ్యాయ వర్గాలకు పలు రకాల కార్యక్రమాలు నిర్వహిస్తూ చేరువ అవుతున్నారు. రాష్ట్రంలో 42అసెంబ్లీ స్థానాలు, ఆరు లోక్‌సభ స్థానాల పరిధిలో ఈ ఎమ్మెల్సీ నియోజకవర్గ పరిధి విస్తరించి ఉండడంతో ఓటర్లను కలవడం, ప్రచారం చేయడం అభ్యర్థులకు కష్టతరం. ఈ క్రమంలో ఇప్పటి నుంచే ఎమ్మెల్సీగా పోటీ చేసేందుకు సిద్ధపడుతున్న ఆశావహులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఆ మేరకు బరిలో ఉండే రాజకీయ పార్టీల నుంచి అభ్యర్థులు, స్వతంత్రులు సైతం ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఉమ్మడి కరీంనగర్‌కు చెందిన పలువురు నాయకులు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పర్యటిస్తున్నారు. విద్యార్థులు, టీచర్ల సంఘాలతో సభలు, సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఉమ్మడి జిల్లా నుంచి మంచిర్యాల పరిధిలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ రావు పార్టీ నాయకత్వం ఆదేశిస్తే పోటీలో ఉండేందుకు సిద్ధంగా ఉన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కోసం నిర్మల్ జిల్లాకు చెందిన కృష్ణారావు బరిలో ఉంటామని సంకేతాలు ఇస్తున్నారు. వీరితోపాటు పలువురు విద్యావంతులు, రాజకీయ నాయకులు, ప్రైవేటు టీచర్ల అసోసియేషన్ నుంచి పట్టభద్రుల స్థానానికి పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నారు. నియోజకవర్గ పరిధి విస్తృతంగా ఉండడంతో ఆయా జిల్లాల పరిధిలో పోటీలో ఉన్న వారు తమ పార్టీ నాయకుల మద్దతుతో పాటు స్థానికులు, ఇతర జిల్లాల్లోనూ మద్దతు కూడగట్టాల్సి ఉంది. దీంతో ఎక్కడి నుంచి ఎవరు తుది వరకు బరిలో ఉంటారనేది మరికొద్ది రోజుల్లో తేలనుంది.

ఓటరు నమోదు వివరాలు
ఈ నెల 30న పబ్లిక్ నోటీసు
అక్టోబర్ 16న మొదటిసారి పబ్లికేషన్
అక్టోబర్ 25 రెండోసారి పబ్లికేషన్
నవంబర్ 6వరకు ఓటరు నమోదుకు గడువు
నవంబర్ 23న ముసాయిదా ఓటరు జాబితా
నవంబర్ 23నుంచి డిసెంబర్ 9వరకు అభ్యంతరాల స్వీకరణ
డిసెంబర్ 25వరకు అభ్యంతరాల పరిష్కారం
డిసెంబర్ 12న ఓటరు జాబితా ప్రచురణ
డిసెంబర్ 30న తుది జాబితా

నర్సింగ్ విద్యార్థులకు వసతిగృహం

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే



భవనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్‌రూరల్: రాబోయే విద్యాసంవత్సరంలో ప్రభుత్వ బీఎస్సీ నర్సింగ్ విద్యార్థులకు సౌకర్యవంతంగా ఉండేలా కళాశాల వసతిగృహం ఏర్పాటు చేస్తామని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని అంకుసాపూర్ జీపీలో నిర్మాణంలో ఉన్న భవనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు పూర్తిస్థాయిలో ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. భవన నిర్మాణాన్ని సకాలంలో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. అనంతరం వైద్య కళాశాలను పరిశీలించారు.

ఎగ్జిబిషన్ వద్దని ఆందోళన



ఆందోళన చేస్తున్న వాకర్స్ అసోసియేషన్ సభ్యులు

కాగజ్‌నగర్ రూరల్: పట్టణంలోని ఎస్పీఎం క్రీడామైదానంలో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయవద్దని డిమాండ్ చేస్తూ శనివారం వాకర్స్ అసోసియేషన్ సభ్యులతో పాటు యువకులు ఆందోళన చేపట్టారు. క్రీడామైదానంలో వాకింగ్‌తో పాటు వ్యాయామం చేస్తుంటామని, గణపతి, దసరా ఉత్సవాలు కూడా ఇక్కడే నిర్వహిస్తుంటారన్నారు. ఎస్పీఎం యాజమాన్యం వెంటనే స్పందించి ఎగ్జిబిషన్ ఏర్పాటును నిలిపివేయాలని డిమాండ్ చేశారు. వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, యువకులు పెద్ద ఎత్తున క్రీడామైదానం వద్ద ఆందోళన చేపట్టడంతో ఎస్పీఎం జీఎం పీఆర్వో రామారావు, పోలీసు అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయబోమని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

నిమజ్జనం ప్రశాంతంగా నిర్వహించాలి

ఆసిఫాబాద్: జిల్లాలో గణేశ్ నిమజ్జనం ప్రశాంతంగా నిర్వహించాలని ఎస్పీ డీవీ శ్రీనివాస రావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఊరేగింపు వాహనాలు విగ్రహాల ఎత్తుకు తగ్గట్టుగా నిర్దేశిత మార్గాల్లో వెళ్లాలని సూచించారు. నిమజ్జన వాహనంపై లౌడ్ స్పీకర్లు అమర్చకూడదని, విగ్రహాన్ని తీసుకెళ్లే వాహనం ప్రార్థనా స్థలాల వద్ద నిలపకూడదని, ఊరేగింపులో కర్రలు, కత్తులు, మారణాయుధాలు, మండే పదార్థాలు, ఆయుధాలు తీసుకెళ్లవద్దన్నారు. బాణాసంచా కాల్చవద్దని, జెండాలు, అలంకరణ కోసం ఉపయోగించే కర్రలు రెండు అడుగుల పొడవుకు మించరాదన్నా రు. ఊరేగింపులో రెచ్చగొట్టే ప్రసంగాలు చేయవద్దని సూచించారు. నిమజ్జన ప్రాంతం వద్ద క్రేన్ ద్వారానే విగ్రహాలు చెరువులో వేయాలన్నారు. మంటపాల నిర్వాహకులు పోలీసుల సూచనలు పాటించాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100 కు కాల్ చేయవచ్చని సూచించారు.

'ఆపరేటర్లకు అన్యాయం జరిగితే ఊరుకోం'



ఈపీ ఆపరేటర్లతో మాట్లాడుతున్న వైవీ రావు

రెబ్బెన: ప్రమోషన్ల విషయంలో ఈపీ ఆపరేటర్లకు ఏమాత్రం అన్యాయం జరిగినా చూస్తూ ఊరుకోబోమని ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రటరీ వైవీ రావు అన్నారు. బెల్లంపల్లి ఏరియాలోని కైరిగూడ ఓసీపీలో శనివారం కార్మికులను కలిసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. డీ గ్రేడ్ నుండి సీ గ్రేడ్‌కు రెండేళ్లు, సీ గ్రేడ్ నుండి బీ గ్రేడ్‌కు మూడేళ్లు, బీ గ్రేడ్ నుండి ఏ గ్రేడ్‌కు మూడేళ్ల టైంబాండ్ ప్రకారం ప్రమోషన్లు కల్పించేలా కృషి చేయాలని ఈపీ ఆపరేటర్లు కోరారు. ఇన్సెంటివ్ విధానంలో మార్పులు చేసి అందరికీ అందేలా చూడాలన్నారు. ఎస్1 విధానాన్ని రద్దు చేయాలన్నారు. సంస్థ వార్షిక బొగ్గు ఉత్పత్తి సాధనలో 70 శాతం ఓసీపీల్లోని ఈపీ ఆపరేటర్ల ద్వారానే సాధించబడుతోందని అయినప్పటికి యాజమాన్యం ఆపరేటర్ల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని వాపోయారు. అనంతరం వైవీ రావు మాట్లాడుతూ ప్రమోషన్ల విషయంలో జాప్యం లేకుండా యాజమాన్యంతో మాట్లాడుతామన్నారు. ఖాళీలతో సంబంధం లేకుండా టైంబాండ్ ప్రకారం ప్రమోషన్లు కల్పించేలా యాజమాన్యంతో చర్చించి సమస్యను పరిష్కరిస్తామన్నారు. వచ్చే స్ట్రక్చర్ కమిటీ సమావేశంలో చర్చించి న్యాయం జరిగేలా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి, ఉపాధ్యక్షుడు బయ్యా మొగిళి, ఆర్జీ 3 ఏరియా బ్రాంచి కార్యదర్శి ప్రకాష్, గోలేటి బ్రాంచి ఆర్గనైజింగ్ కార్యదర్శులు రాజేశ్, కిరణ్‌బాబు, చంద్రశేఖర్, దివాకర్, పిట్ కార్యదర్శి మారం శ్రీనివాస్, నాయకులు అంజన్న, తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

డాక్టర్ పట్టా అందుకున్న గిరిజన మహిళ



పట్టా అందుకుంటున్న లలిత

బెజ్జూర్: మండలంలోని కుకుడ గ్రామానికి చెందిన గిరిజన మహిళ సడిమెక లలిత ఓయూలో పీజీ, ఎంఏ తెలుగు పూర్తిచేసింది. దేశవ్యాప్తంగా నిర్వహించే అధ్యాపక పరీక్ష కోసం యూజీసీ నెట్ జేఆర్ఎఫ్ సెట్‌కు అర్హత సాధించింది. ఈమె హైదరాబాద్‌లోని తెలంగాణ సరస్వతి పరిషత్ ప్రాచ్య కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తోంది. ఉస్మానియా ఓరియంటల్ తెలుగు విభాగంలో డాక్టర్ అజ్మీర సిల్మా నాయక్ పర్యవేక్షణలో 'పరిణీతవాని ప్రసంగాలు–సాహిత్య, సాంస్కృతిక అధ్యయనం 'అనే అంశంపై పరిశోధన పూర్తి చేసింది. ఇందుకుగాను శనివారం ఆమెకు డాక్టరేట్ పట్టా అందుకుంది. పట్టా అందుకున్న ఆమెను తల్లిదండ్రులు పార్వతి–శంకర్, మండల ప్రజలు అభినందించారు.

కార్మికుడికి పాముకాటు

జైపూర్: ఇందారం ఐకే1ఏ గనికి చెందిన జనరల్ మజ్దూర్ కార్మికుడు రాము పాము కాటుకు గురయ్యాడు. శనివారం విధులకు వచ్చిన రాము గోదావరి నది వద్ద ఏర్పాటు చేసిన షెల్టర్‌లో రివర్‌గార్డుగా పని చేస్తుండగా పాము కాటేసింది. చికిత్స నిమిత్తం అతన్ని ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు తరలించినట్లు సమాచారం.

అట్టహాసంగా బేస్‌బాల్ పోటీలు

- ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, డీఎస్పీ గంగారెడ్డి
- 22 జిల్లాల నుంచి 980 మంది క్రీడాకారులు హాజరు



పోటీలను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, డీఎస్పీ గంగారెడ్డి

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో రాష్ట్రస్థాయి అండర్–21 జూనియర్స్ బాల, బాలికల బేస్‌బాల్ పోటీలు శనివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. జిల్లా బేస్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మూడు రోజుల్లో జరిగే పోటీలను మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిర్మల్‌లో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. క్రీడాకారులు ఆటల్లో సత్తాచాటి జాతీయస్థాయిలో పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. బేస్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పుంద్రు సుధాకర్‌రెడ్డి, కార్యదర్శి గంగాధర్ నేతృత్వంలో నిర్వహిస్తున్న పోటీల్లో 22 జిల్లాల నుంచి మొత్తం 980 మంది క్రీడాకారులు, 22 మంది కోచ్‌లు, 22 మంది సబ్ కోచ్‌లు పాల్గొన్నారు. మొదటి రోజు నిర్వహించిన పోటీల్లో హైదరాబాద్ బాలుర జట్టు, పెద్దపల్లి జట్టు తలపడ్డాయి. ఇందులో హైదరాబాద్ 7–0తో విజయం సాధించింది. బాలికల జట్టులో రంగారెడ్డి, సిద్దిపేట జట్లు తలపడ్డాయి. ఇందులో రంగారెడ్డి 08–01తో గెలుపొందింది. పోటీల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు రాజస్థాన్‌లోని బికనూరులో ఈనెల 30 నుంచి జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారు. కార్యక్రమంలో ఆర్గనైజర్ జమున, పీటీ భూమన్న, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

క్రీడలు అంటే ఇష్టం



నాకు చిన్నప్పటి నుంచి క్రీడలు అంటే ఎంతో ఇష్టం. గత మూడేళ్ల నుంచి బేస్‌బాల్‌లో మెలకువలు నేర్చుకున్నా. ఇప్పుడు ఇంటర్ ప్రథమ సంవత్సరం ఇప్పటివరకు మూడు రాష్ట్రస్థాయి, ఒకటి జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్నా. జాతీయస్థాయి పోటీలకు ఎంపికై ప్రతిభ కనబర్చి ముందుకెళ్లాలని కోరిక.

– స్పందన, నిర్మల్ జట్టు

జాతీయ స్థాయికి ఎంపికవుతా..



రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చి జాతీయస్థాయికి ఎంపికవుతా. ఇప్పటివరకు 4 జాతీయస్థాయి, 7 రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్నా. ప్రపంచ స్థాయిలో పాల్గొనాలనేదే నా లక్ష్యం.

– బిందు, కామారెడ్డి జట్టు

తల్లిదండ్రుల ప్రోత్సాహంతో



తల్లిదండ్రుల ప్రోత్సాహంతో కష్టపడి ముందుకెళ్తున్నా. గత మూడేళ్ల నుంచి బేస్‌బాల్ నేర్చుకున్నా. ఇప్పటివరకు మూడు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్నా. ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి జాతీయస్థాయికి ఎంపిక కావడమే లక్ష్యం. – పరమేశ్వర్ మహబూబాబాద్ జట్టు

జిల్లాకు పేరు వస్తుంది



రాష్ట్రస్థాయి బేస్ బాల్ పోటీలకు అన్ని రకాల వసతులు కల్పించాం. 22 జిల్లాల నుంచి 22 జట్లు ఇక్కడికి వచ్చాయి. ఈ పోటీలు నిర్వహించడంతో జిల్లాకు ఎంతో పేరు వస్తుంది. – సుధాకర్‌రెడ్డి, నిర్మల్ జిల్లా బేస్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు



అక్కెపల్లి వాగుపై ఒక పక్క కూలిన కాజ్‌వే

మండలంలోని అక్కెపల్లి గ్రామానికి వెళ్లేదారిలో వాగుపై ఉన్న కాజ్‌వే కూలింది. ఇప్పటికే ఒక పక్కకు కూలిపోగా, కొంచెం ముందుకు వెళ్లగానే మధ్యలో పెద్దగుంత ఏర్పడింది. శనివారం అక్కెపల్లి నుంచి చెన్నూర్ వైపు ప్రయాణికులతో వెళ్తున్న టాటాఏస్ వాహనం గుంతలో దిగబడింది. ప్రయాణికులు, గ్రామస్తులు సుమారు గంట పాటు శ్రమించి వాహనాన్ని బయటకు తీశారు. వాగు ప్రవాహ సమయంలో ఇలా జరిగితే ప్రమాదాలు సంభవిస్తాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు వాగుపై వంతెన నిర్మించేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

– చెన్నూర్‌రూరల్

బీజేపీ నేతల ముందస్తు అరెస్టు



తిర్యాణి పోలీస్‌స్టేషన్‌లో బీజేపీ నాయకులు

ఆసిఫాబాద్: బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్రశాఖ పిలుపు మేరకు చలో జైనూర్ కార్యక్రమానికి వెళ్లకుండా జిల్లాలోని బీజేపీ నేతలను పోలీసులు ముందస్తు అరెస్టు చేసి, తిర్యాణి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. జైనూర్ ఘటనలో బాధితులను పరామర్శించేందుకు వెళ్తున్న తమను శుక్రవారం అర్ధరాత్రి అరెస్టు చేయడాన్ని ఖండిస్తున్నట్లు నాయకులు తెలిపారు. పోలీస్ స్టేషన్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. జిల్లా అధికార ప్రతినిధి కేసరి ఆంజనేయులు గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు సునీల్ చౌదరి, విశాల్ ఖాండ్రే, జిల్లా కార్యదర్శి కుందారపు బాలకృష్ణ, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి సంజీవ్, అసెంబ్లీ కన్వీనర్ రమేశ్ గౌడ్, తిర్యాణి మండల అధ్యక్షుడు వెంకటేశ్, రెబ్బెన మండల ప్రధాన కార్యదర్శి నవీన్ గౌడ్, ఆనంద్, ఆత్రం గోపాల్, నాయకులు శ్రీనివాస్, సుభాష్, జయరాజ్ ఉన్నారు.

పాముకాటుతో సెక్యూరిటీ గార్డు మృతి!



నవీన్ మృతదేహం

కాసిపేట: మండలంలోని దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపెనీ సెక్యూరిటీ గార్డుగా సిడాం నవీన్ పాముకాటుతో మృతి చెందాడు. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం..తిర్యాణి మండలం నాయకపుగూడకు చెందిన నవీన్ (24), మహారాష్ట్రకు చెందిన వైభవ్ రావత్‌లు కంపెనీలో సెక్యూరిటీ గార్డులుగా విధులు నిర్వహించి శుక్రవారం రాత్రి కంపెనీ కాలనీలోని కమ్యూనిటీ హాల్ వెనుకాల వారికి కేటాయించిన బ్యారక్ (షెడ్)లో నిద్రించారు. శనివారం తెల్లవారుజామున నవీన్, వైభవ్ రావత్‌కు కడుపునొప్పి, వాంతులు అయ్యాయి. పక్కన ఉన్న సెక్యూరిటీ సిబ్బంది గమనించి మంచిర్యాల మెడిలైఫ్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే నవీన్ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. వైభవ్‌ను మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు తరలించారు. నవీన్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బెల్లంపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించిన విషయం తెలుసుకున్న ఆదివాసీ సంఘాలు అక్కడికి చేరుకుని ఆందోళనకు దిగారు. కంపెనీ యాజమాన్యం, పోలీసులు సాయంత్రం వరకు చర్చలు జరిపి మృతుడి కుటుంబానికి రూ.8 లక్షల ఆర్థికసాయం, కుటుంబ సభ్యులకు ఒకరికి ఉద్యోగం, తల్లిదండ్రులకు నెలకు రూ.6 వేల చొప్పున పెన్షన్ మాదిరి ఆర్థిక సాయం అందించనున్నట్లు తెలపడంతో వివాదం సద్దుమణిగింది. కాగా మృతుడు, బాధితుడు కడుపునొప్పి, వాంతులు రావడం ఫుడ్ పాయిజన్ అయి ఉండవచ్చునని, పాముకాటు వేసిందా అనే అనుమానాలను తోటి ఉద్యోగులు లేవనెత్తుతున్నారు. పోస్టుమార్టం రిపోర్టు వచ్చాక వివరాలు తెలుస్తాయని, ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై ఆంజనేయులు తెలిపారు.

18న కార్మిక సమస్యలపై ధర్నా

బెల్లంపల్లి: కార్మిక సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 18న జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు ఇఫ్టూ జిల్లా కార్యదర్శి జాడి దేవరాజ్ తెలిపారు. శనివారం బెల్లంపల్లి కాంటా చౌరస్తా వద్ద జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలతో కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అసంఘటిత కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు ఎన్నో రకాల సమస్యలు ఎదుర్కొంటున్నారని అన్నారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడానికి నిర్వహించే ధర్నాకు కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యుడు మల్లయ్య, శ్రేణులు రమేష్, చరణ్, చంద్రయ్య, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు



రోగుల ఆరోగ్య పరిస్థితి తెలుసుకుంటున్న కృష్ణ

ఇంద్రవెల్లి: గ్రామీణులకు అందుబాటులో ఉంటూ సకాలంలో మెరుగైన వైద్యసేవలు అందించాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని డీఎంహెచ్‌వో కృష్ణ అన్నారు. మండలంలోని పిట్టబొంగరం పీహెచ్‌సీ శనివారం తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. ప్రసవాలు, ఫీవర్ సర్వే, సీజనల్ వ్యాధులకు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఓపీ సేవలు మెరుగుపరచాలని, సమయపాలన పాటించాలని వైద్యులు, సిబ్బందికి సూచించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. ఆయన వెంట జిల్లా మలేరియా అధికారి శ్రీధర్, వైద్యుడు ప్రతాప్‌నాయక్, హెచ్ఈవో గోకుల్ తదితరులున్నారు.

భార్యాభర్తల రిమాండ్

చింతలమానెపల్లి: రవీంద్రనగర్–2 పంచాయతీలో ఈనెల 11న జరిగిన దాడి ఘటనలో భార్యాభర్తలను శనివారం రిమాండ్ తరలించినట్లు ఎస్సై నరేశ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..బుధవారం రాత్రి సమయంలో అన్నదమ్ములు కృష్ణ మండల్, పవిత్రమండల్‌ల మధ్య వివాదం చోటు చేసుకుంది. అన్న కృష్ణమండల్‌పై తమ్ముడు పవిత్ర మండల్ అతని భార్య ఉమ మండల్ కత్తితో దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడి భార్య హీరా మండల్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ

చెన్నూర్: లక్సెట్టిపేటలో జరిగిన జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో చెన్నూర్ మహాత్మా జ్యోతి బాపూలే గురుకుల పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్–18లో 1000 మీటర్ల పరుగుపందెంలో టి.ప్రశాంత్, లాంగ్‌జంప్‌లో ఆర్.శ్రావణ్‌కుమార్, (ప్రథమ), డిస్క్ త్రో, జావెలిన్ త్రోలో అజయ్ (ద్వితీయ), 600 మీటర్ల పరుగుపందెంలో టి.రిషిత్ (ప్రథమ) స్థానాల్లో గెలుపొందారని ప్రిన్సిపాల్ కేవీఎం ప్రకాశ్ రావు తెలిపారు. హైదరాబాద్‌లో ఈనెల 19, 20 తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయిపోటీల్లో వారు పాల్గొంటారని వివరించారు.